క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



గీతాంజలి హైస్కూల్‌లో ప్రత్యేక అలంకరణలో సరస్వతీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణంలోని పలు సరస్వతీదేవి ఆలయాల్లో, పాఠశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిరంలోని సరస్వతీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. 140 మందికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి పాల్గొన్నారు.

వి గేమ్స్ క్లబ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం రోడ్డులో గంగమ్మ తల్లి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వి గేమ్స్ క్లబ్‌ను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు ఈక్లబ్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ క్రికెట్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, ఓపెన్ థియేటర్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయనాగేంద్ర, డాక్టర్ సమితి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కిడ్నీ సెంటర్ ప్రారంభం



కిడ్నీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రంగారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సాయి కుటీర్‌రోడ్డు ఎంట్రెన్స్‌లో వైద్యులు కే నరేంద్రరెడ్డి, సి కల్యాణీలు నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణి కిడ్నీ సెంటర్‌ను బుధవారం ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు నరేంద్రరెడ్డి, కల్యాణిలు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పరిసర ప్రాంత ప్రజలకు కిడ్నీ సంబంధిత వ్యాధులకు మెరుగైన సేవలను అందించేందుకు జిల్లాలోనే మొట్టమొదటి సారిగా వరల్డ్ ఫాస్టెస్ట్ టీఎఫ్ఎల్ లేజర్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు త్యాగరాజరెడ్డి, జీవీజీ మహేష్, శివప్రసాద్‌రెడ్డి, నాగమల్లేశ్వరి, సీ వెంకటసుబ్బారెడ్డి, చెన్నకృష్ణమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

పోరుమామిళ్ల : వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పోరుమామిళ్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నా.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు క్రైం : రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రచారం ప్రారంభిస్తున్నామని .. ప్రజలు ఆశీర్వదించాలని, ఏకపక్ష తీర్పుతో గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటలకు రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో పాటు అన్ని వర్గాలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలు హాజరు కానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో మాదిరే ఈసారి కూడా ఆదరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో రెండేళ్లు కరోనా సంక్షోభ కాలం మినహాయిస్తే మిగిలిన మూడేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించామని ఎమ్మెల్యే తెలిపారు. పేదరికంలో ఉన్న ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా మేలు జరిగిందన్నారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం రూ. 200 కోట్ల రుణాన్ని చెల్లించి స్త్రీల ఆర్థిక భద్రతకు కృషి చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి అగ్రతాంబూలం ఇచ్చామన్నారు. పంట పెట్టుకోవడానికి రైతులకు ఏటా రూ. 13500 ఇచ్చామన్నారు. రూ. 1000 ఉన్న ఫించన్‌ను రూ. 3000 పెంచుతూ 1వ తేదీనే ఇంటి వద్దకు వచ్చి అందజేస్తున్నామన్నారు. చేనేతలకు ప్రతి సంవత్సరం రూ. 24 వేల ఆర్థిక సహాయం ఇచ్చామన్నారు. ఆటో కార్మికులు, రజక, నాయీబ్రాహ్మణులకు ఆర్థిక సహకారం అందించామన్నారు. నియోజకవర్గంలోని పేదవారి సొంతింటి కల నెరవేర్చాలని 500 ఎకరాల్లో 24 వేల ఇళ్లను నిర్మిస్తున్న మాట సత్యమైతే, ప్రొద్దుటూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఉంటేనే ఓటు వేయాలని ఎమ్మెల్యే అన్నారు. 10 ఏళ్ల కాలంలో పట్టణంలోని వ్యాపారులు తన వల్ల ఇబ్బంది పడలేదని ఎమ్మెల్యే తెలిపారు. తాను అభివృద్ధి చేశానని చెప్పిన ప్రతి సారి టీడీపీ నాయకులు అవినీతి పరుడని చెబుతున్నారన్నారు. తాను చేసిన అభివృద్ధి సత్యమో.. తాను చేయని అవినీతిపై టీడీపీ నేతలు చేస్తున్న విషప్రచారం సత్యమో విజ్ఞులైన ప్రజలు గ్రహించాలన్నారు.

ప్రచారాన్ని చూసి టీడీపీకి వణుకు పుట్టాలి

ప్రొద్దుటూరు : మన ఎన్నికల ప్రచారాన్ని చూసి టీడీపీ నేతలకు వెన్నులో వణుకు పుట్టాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లతోపాటు ఇతర నేతలతో కలసి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికలకు సంబంధించి గురువారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 60 రోజుల పాటు జరిగే ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ప్రతి రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



దుర్గ, మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల నుండి జరుగుతున్న శ్రీదుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి నూతన బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట, ఉత్సవమూర్తుల సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామిల కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు దర్శిసుబ్బరాజు, నాగభూషణం, చంద్రశేఖర్, అశోక్ కుమార్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అతి వేగం ప్రమాదాలకు హేతువు

మైదుకూరు : అతి వేగం ప్రమాదాలకు హేతువని ఏపీ ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) మైదుకూరు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు అన్నారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ డిపో వద్ద నుంచి అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ప్రయాణికులు కూడా కదిలే బస్సుల నుండి దిగవద్దని, వేగంగా వెళుతున్న బస్సుల వెంట ఆపమని పరిగెత్తవద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్–2 సరోజినమ్మ, జనరల్ ఏడీసీ లక్ష్మయ్య, చార్జి ఏడీసీ ఉమాదేవి, జీసీఈ జయమ్మ, గ్యారేజ్ ఇన్‌చార్జి జోగిరెడ్డి, కార్గో ఇన్‌చార్జి సుబ్బయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు మునెయ్య, ఎస్ఎండీ రఫి తదితరులు పాల్గొన్నారు. భద్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూర్బా పాఠశాల, జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్ల విద్యార్థులకు, సాయినాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి డీఎం శ్రీనివాసరావు, డిపో అధికారులు బహుమతులు అందించారు.

నేడు యాదవుల సమావేశం



రేకలకుంటలో యాదవుల సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని బద్వేల్, మైదుకూరు జాతీయ రహదారిలో ఉన్న రేకలకుంట గ్రామానికి గురువారం ఉదయం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ ఆర్ రమేష్‌యాదవ్‌లు వస్తున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రేకలకుంట సమీపంలోని రాణీబావి గంగమ్మతల్లి ఆలయ నిర్మాణంకు మొదటగా భూమి పూజ ఎంపీ చేతుల మీదుగా జరుగుతుందన్నారు. అనంతరం అక్కడే నియోజకవర్గ స్థాయి యాదవ నాయకుల సమ్మేళనం ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభిస్తారన్నారు. కాగా సభాస్థలిని ఎమ్మెల్సీ పరిశీలించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



చెన్నముక్కపల్లెలో విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడే సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి సీఎంగా గెలిపించుకుందాం అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పంచాయితీలోని ఎస్సీ కాలనీలో రూ. 7లక్షలతో నిర్మిస్తున్న చర్చి ప్రహరీ నిర్మాణంకు ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి..

18వ తేదీన సీఎం జగన్ చేపట్టిన సిద్ధం సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పార్టీ నాయకులను కోరారు. ఎంపీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజక వర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, శివరామిరెడ్డి, బుజ్జి, పెద్దిరెడ్డి, ఎంపీటీసీలు రాముడు, బండి శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మున్వర్, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్

రాజుపాళెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని రాష్ట్ర ఉద్యానవన సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తున్న జొన్నలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా జొన్నలు రూ.2,300 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం క్వింటా రూ.3,180తో కొనుగోలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ముడియం గౌతమ్ రెడ్డి, గోనా వెంకటసుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిరసన

మైదుకూరు : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీఓ జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

మెరుగైన వైద్య సేవలు

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కౌన్సిలర్ ద్వార్శల భారతీ తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని శాస్త్రినగర్‌లో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వైద్య శిబిరాన్ని సందర్శించారు.

చర్చిల అభివృద్ధికి కృషి



చాపాడులో సీఎస్ఐ చర్చి ఆధునికీకరణకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలోని శిథిలావస్థకు చేరుకున్న చర్చిల ఆధునీకరణ, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని.. దళితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని సీఎస్ఐ చర్చిని రూ.12లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆధునీకరణ చేపట్టేందుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దళితులు వారిని కలసి చర్చి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో చర్చి నిర్మాణం పూర్తి చేసేందుకు సహకారం అందించాలని చాపాడులోని దళిత మహిళలు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులను గ్రామ పెద్దలు రూబేన్, ఏసురత్నం, రవి, ప్రణయ్, శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, జడ్పీటీసీ శాంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, పీవీ రమణారెడ్డి, జయరామిరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, వర్రా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరు మండలం నంద్యాలంపేట పంచాయతీలోని లోకాయపల్లెలో బుధవారం నూతన చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు పాత చర్చి స్థానంలో కొత్త చర్చి నిర్మించేందుకు ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి రూ.9లక్షల నిధులు మంజూరు చేయించారు. బుధవారం గ్రామంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆయన తనయుడు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డిలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేదల సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరైన పలువురు లబ్ధిదారులకు బుధవారం స్థానిక అమ్మవారిశాల వీధిలోని సత్యమ్మగుడి ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించారని, తద్వారా పేదలకు సర్వహక్కులతో లక్షల విలువైన ఆస్తి సొంతం కానుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, కౌన్సిలర్ సమత, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు




ఆలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధను సన్మానిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రాజుగారివీధిలో వెలసిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఘనంగా సన్మానించారు. అనంతరం సీతారాముల కల్యాణం జరిపించారు. సాయంత్రం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, వార్డు కౌన్సిలర్ ఉమ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ఇతర భూములను స్వాధీనం చేసుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ప్రొద్దుటూరుకు చెందిన బద్రినాథ్ కుమారుడు రఘునాథ్, కుమార్తెలు రాజా వైష్ణవి, రాజ వినీత ఒక ప్రకటనలో తెలిపారు. తమ పూర్వీకులకు ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధి సర్వే నంబర్ 616లో 5 ఎకరాల భూమి ఉందన్నారు. 1880లో తమ పూర్వీకులైన అశ్వర్థమయ్య ఈ భూమిని కొనుగోలు చేశారన్నారు. అనంతరం అతని కుమారులు సుబ్బయ్య తద్వారా, ఆయన కుమారులు రంగారావు, బద్రినాథ్ ద్వారా ఆ భూమిపై వంశపారంపర్య హక్కులను తాము పొందామన్నారు. 2008లో సగిలి సుబ్బారెడ్డి భయభ్రాంతులకు గురి చేసి ఈ భూమిని 13 మందికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఈ సంఘటన జరిగిన వెంటనే తాము పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆ భూమిపై ఏళ్ల తరబడి విచారణ సాగిందని, ఇటీవలే విచారణను ముగించిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసిందన్నారు. తీర్పు వెలువడాల్సి ఉండగా ప్రొద్దుటూరు వాసులైన పెరుగు నారాయణ యాదవ్, గుత్తి వీరనారాయణ అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో అక్రమ నిర్మాణాలకు భూమి పూజ చేశారన్నారు. తమ పూర్వీకుల నుంచి సక్రమంచిన భూమిని స్వాధీనం చేసుకుని తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని సీఎంను కోరుతున్నామన్నారు.



O.S.No.45/2021

బి. బాలవెంకటయ్య

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి రూ.2కోట్లు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మాడ వీధులు, ప్రహరీ నిర్మాణం కోసం అంచనాలు తయారు చేయాలని ఈఓ రామానుజన్‌కు ఎమ్మెల్యే సూచించారు. దాదాపు రూ.2కోట్లు అవుతుందని ఆయన తెలపగా దానికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని, భూమి పూజ కార్యక్రమానికి తనను పిలవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ఆలయ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, మాజీ ధర్మకర్త వుట్టి నాగశయనం, కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.





సిద్ధం సభను విజయవంతం చేద్దాం

చాపాడు : ఈ నెల 18న రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించనున్న సిద్ధం ప్రాంతీయ శంఖారావం సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడి కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నాగిరెడ్డి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, జయరామిరెడ్డి, రామచంద్రయ్య, వినయ్‌కుమార్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు మంజూరు

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి కడప జిల్లా గ్రంథాలయ సంస్థ వారు కాంపిటీషన్ పుస్తకాలను మంజూరు చేసినట్లు గ్రంథాలయ అధికారిణి టి.తిరుపతమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–2 పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరాంజనేయ ఆలయ అభివృద్ధికి కృషి

చాపాడు : మండలంలోని విశ్వనాథపురం వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. వీరాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా చెన్నకేశవరెడ్డి, సభ్యులుగా పెద్దగురివిరెడ్డి, చిన్నగురివిరెడ్డి, ఓబుళరెడ్డి, నారాయణమ్మ, ఓబుళమ్మలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.



రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ 23వ వార్షికోత్సవం సందర్భంగా వారి బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ఉద్యోగులు, ప్రజలు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని జిల్లా ఆస్పత్రికి అందచేస్తున్నట్లు మేనేజర్ అనిల్ చౌదరి తెలిపారు.

